సాక్షి ఒడిశా
శుక్రవారం । 31 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,90,666
బంగారం	230 మిల్లీ గ్రాములు
వెండి	48 గ్రాముల 750 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



సిద్ధమవుతున్న జగన్నాథ రథ చక్రాలు

- 8లో ▸

నాలుగో దశ ఎన్నికల్లో 460 మంది పోటీ



నాలుగో దశ ఎన్నికల్లో 460 మంది పోటీ రాష్ట్రంలో శని వారం జరగనున్న చివరి విడత లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో సమగ్రంగా 460 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

- 8లో ▸

న్యూస్‌రీల్

పొగాకు ఆరోగ్యానికి హానికరం



షాపుల వద్ద ప్రచారం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

జయపురం: పొగాకు ఆరోగ్యానికి హానికరమని ఎన్‌సీసీ విద్యార్థినులు తెలియజేశారు. ఈనెల 31వ తేదీన అంతర్జాతీయ పొగాకు నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ మహిళా ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రచారాన్ని గురువారం చేపట్టారు. పొగాకు వలన కలిగే అనర్థాల నుంచి బయటపడాలని ప్రజలకు సూచిస్తున్నారు. ప్రతీ దుకాణానికి వెళ్లి పొగాకు ఉత్పత్తులను అమ్మవద్దని సూచించారు. పొగాకు ఉత్పత్తులకు యువత బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌యూవో దేవస్మిత బెనియ, జేయూవో గౌరీ ముదులి, ఎస్‌జీవో బాలేశ్వరి బారిక్, సీడీటీ జ్యోతి సాహు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందరి భాగం

జయపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌కు వెళ్లి పూజలు చేసి తిరిగి స్వగ్రామానికి వస్తున్న ఒక కారు వేగంగా వస్తూ ఒక ట్రక్కును ఢీకొంది. దీంతో కారులో పయనిస్తున్న నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారు నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ సమితి ఖిరిపాదర్ గ్రామానికి చెందిన బలరాం గౌడ(40), అతడి కుమారుడు చందన గౌడ(6), బలరాం తల్లి అయిలా గౌడ(60), తొహర పంచాయతీ బొణిపాదర్ గ్రామానికి చెందిన చిత్ర గౌడ(35)లుగా గుర్తించారు. సంఘటన స్థలానికి జయపురం సదర్ పోలీసులు చేరుకొని గాయపడినవారిని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. ప్రమాదానికి గురైన కారుని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



తులసి మృతదేహం వద్ద రోదిస్తున్న ఆమె తల్లి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా పోలీసుస్టేషన్ పరిధి రచ్చగుడ గ్రామంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపాటుకు ఒక మహిళ మృతి చెందింది. మృతి చెందిన మహిళ రచ్చగుడ గ్రామానికి చెందిన తులసీ దొళాయి (23)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బరంపురం మెడికల్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తులసీ దొళాయి గ్రామ సమీపంలోని వాగు వద్దకు స్నానానికి వెళ్తున్న సమయంలో ఉరుములు మెరుపులు రావడంతో చెట్టు కిందికి వెళ్లింది. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో ఆమె అచేతన స్థితిలో ఉండిపోయింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఆమెను మోహనా సామాజిక స్వస్థ కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

'గ్రామాల్లో ఉచిత వైద్య సేవలు'



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని, అందుకు రోటరీ క్లబ్ కృషి చేస్తుందని జయపురం రోటరీ క్లబ్ అధ్యక్షుడు అశోక్ మిశ్ర అన్నారు. జయపురం రోటరీ క్లబ్ ఆఫ్ ప్రయిడ్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ సమాజ సేవకు ప్రాధాన్యమిస్తుందన్నారు. శిబిరంలో దాదాపు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి సురేష్ పాణిగ్రహి, ఉపాధ్యక్షుడు రామహరి పండ, మురళీధర సాబత్, ప్రభాకర్ చౌదరి, రామనాథ్ సాహు, జి.వెంకటరావు, రబినారాయణ నందో, జ్యోతి స్వరూప్ భాయి, కె.బ్రహ్మ, కాలూరాం పండ, నరేష్ మహకూల్ తదితరులు పాల్గొన్నారు.

విషాద యాత్ర



నరేంద్ర సరోవరం తీరంలో బాణాంచా పేలుడు దృశ్యాలు



- చందన యాత్రలో అపశృతి
- ప్రాణాలను బలిగొన్న అజాగ్రత్త
- బాణాసంచా పేలుడుతో ముగ్గురు మృతి
- సుమారు 30 మందికి గాయాలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని వెలుపల చందన యాత్రలో విషాదం చోటు చేసుకుంది. స్వల్ప అజాగ్రత్త ముగ్గురి నిండు ప్రాణాలను బలిగొంది. మరో 30 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పలువురు ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ విషాద సంఘటన ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదిపేసింది. మృతుల్లో ఒక బాలుడు ఉన్నట్లు సమాచారం.

కనులారా చూద్దామని వచ్చి...

పూరీ నరేంద్ర సరోవరంలో శ్రీజగన్నాథుని అలయం వెలుపల తెప్పోత్సవం (చందన యాత్ర) గత కొన్ని రోజులుగా ఆనందోత్సాహాలతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా సరోవరంలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి ఉత్సవమూర్తులు నావల్లో నరేంద్ర సరోవరంలో నిత్యం సంధ్య వేళల్లో విహరిస్తున్నారు. ఈ వేడుకను కళ్లారా ప్రత్యక్షంగా తిలకించేందుకు పలువురు భక్తులు, స్థానికులు నిత్యం పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. వీరి రాకతో నరేంద్ర సరోవరం తీరం జనంతో కిక్కిరిసి ఉంటుంది. ఈ క్రమంలో బుధవారం జరిగిన చందన యాత్రలో ఘోర ప్రమాదం సంభవించింది. స్వామివారి తెప్పోత్సవం జరుగుతుండగా అకస్మాతుగా బాణాసంచా కాలిపోయి భారీ పేలుడు సంభవించిందని ప్రత్యక్ష సాక్షుల కథనం. సరోవరం దేవీ ఘాటు తీరంలో బాణాసంచా కుప్పపై నిప్పురవ్వలు రాలడంతో అకస్మాతుగా పేలుడు సంభవించింది. దీంతో పరిసరాల్లో యాత్ర తిలకిస్తున్న పలువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయాలుపాలైన వారిలో పలువురు ప్రాణ రక్షణ కోసం నరేంద్ర సరోవరం నీటిలోకి దూకారు. స్థానికులు తక్షణమే రంగంలోకి దిగి సత్వర సహాయక చర్యలు చేపట్టారు. బాధితులందరినీ తొలుత స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ఆస్పత్రిలో కాలిన గాయాల చికిత్సకు సంబంధించి ప్రత్యేక యూనిట్ లేనందున నామమాత్రంగా ప్రథమ చికిత్స చేసి వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు.

బాలుడు మృతి

కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మైనరు బాలుడు మృతి చెందాడు. అలాగే మరో ఇద్దరు బాధితులు భువనేశ్వర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు. క్షతగాత్రులను తొలుత స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రి ఔట్ డోర్ విభాగంలో చేర్చి, అనంతరం సర్జరీ వార్డుకు తరలించారు. ఉన్నత చికిత్స కోసం ఇతర ఆస్పత్రులకు తరలించారు. ఈ దుర్ఘటనకు జిల్లా యంత్రాంగమే కారణమని స్థానికులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. పేలుడు తర్వాత సహాయక చర్యల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో గాయపడిన వ్యక్తులకు తక్షణమే సరైన చికిత్స సౌకర్యాలు లేకపోవడంతో పలువురు ప్రాణాపాయ పరిస్థితిలో చిక్కుకున్నారని మండిపడ్డారు.

వినోదం విషాదమైంది

నరేంద్ర సరోవరంలో ఏటా శ్రీజగన్నాథుని చందన యాత్ర సుదీర్ఘంగా 21 రోజులు జరుగుతుంది. అక్షయ తృతీయ పురస్కరించుకుని ఈ యాత్ర ప్రారంభమవుతుంది. మరికొద్ది రోజుల్లో ఈ యాత్ర పూర్తి కానుంది. ఈ తరుణంలో ఈ విషాదం చోటు చేసుకోవడం విచారకరం. స్వామివారి తెప్పోత్సవం పురస్కరించుకుని సరోవరం నడిబొడ్డున తిరుగాడే నావలపై బాణాసంచా కాల్చి వినోదంతో ఉత్సాహవంతంగా యాత్ర నిర్వహిస్తారు. దీనికోసం తీరంలో సిద్ధం చేసి ఉంచిన బాణాసంచాపై నిప్పు రవ్వలు రాలడంతో ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.



క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తున్న దృశ్యం

ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు

- బాధితులను పరామర్శించిన సీఎం నవీన్
- మృతులకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా



వైద్య బృందానికి సూచనలు చేస్తున్న సీఎం నవీన్

భువనేశ్వర్: పూరీ నరేంద్ర సరోవరం తీరంలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ ఘటనలో మరణించినవారికి ఒక్కొక్కరికీ రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అంతకుముందు భువనేశ్వర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆస్పత్రిలో వైద్య ఏర్పాట్లపై సీనియర్ వైద్యులతో చర్చించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) ఈ విచారణను నిర్వహిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి.

చీఫ్ సెక్రటరీ పర్యవేక్షణ

క్షతగాత్రులకు సరైన చికిత్స అందించాలని, ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో ప్రమాదంలో గాయపడి స్థానిక హైటెక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా పరామర్శించారు. బాధితులకు సత్వర చికిత్స కల్పించడంలో వైద్యులు, సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించినట్లు ఆయన తెలిపారు. ఖుర్దా జిల్లా కలెక్టర్ చంచల్ రాణా ఆద్యంతాలు ఈ ప్రక్రియని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, కటక్ జిల్లా మేజిస్ట్రేట్ అరిందమ్, భువనేశ్వర్ కటక్ పోలీసు కమిషనర్ తదితర సీనియర్ అధికారులు చికిత్స కార్యకలాపాలను సమన్వయపరచి పర్యవేక్షిస్తున్నారు. ఈ సంఘటనలో సమగ్రంగా 36 మంది గాయపడి చికిత్స కోసం పలు ఆస్పత్రుల్లో చేరారు. వీరిలో 6 మంది చికిత్స తర్వాత డిశ్చార్జ్ అయ్యారు. ముగ్గురు మరణించగా, ఇంకా 27 మందికి చికిత్స కొనసాగుతోందని చీఫ్ సెక్రటరీ తెలిపారు. ప్రమాదం విషయం తెలియడంతో ప్రత్యేక సహాయ కమిషనర్, పూరి జిల్లా అధికార యంత్రాంగం, పూరీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు జిల్లా ఆస్పత్రిని సందర్శించారు.

ముమ్మరంగా గాలింపు చర్యలు

బాణాసంచా పేలుడు సంభవించిన తీరంలో ముమ్మరంగా గాలిస్తున్నారు. స్థానిక ప్రజలు, అగ్నిమాపక సిబ్బంది, ఒడిశా విపత్తు స్పందన దళం(ఓడ్రాఫ్) ప్రతినిధులు ఘటనా స్థలం ప్రత్యక్షంగా సందర్శించి గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధానంగా నరేంద్ర సరోవరంలో గాలింపుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



పూరీ బాణాసంచా పేలుడు ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయాలకు గురైన వ్యక్తులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రపతి తన సోషల్ మీడియా వేదికగా సంతాప సందేశం ప్రసారం చేశారు. ఈ సందేశంలో పూరీ చందన్ యాత్రలో జరిగిన బాణాసంచా పేలుడులో కొంతమంది మరణించిన విషయం తెలిసి బాధపడ్డారన్నారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర గవర్నర్ సంతాపం



బాణాసంచా పేలుడుపై రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సీఎం నవీన్ దిగ్భ్రాంతి



ప్రమాదంపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి అన్ని వైద్య ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి భరిస్తామని వెల్లడించారు. క్షతగాత్రులకు సరైన చికిత్స అందించాలని, ఆపరేషన్ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నిరాదరణకు బృందావన ప్యాలెస్



శిథిలావస్థలో ఉన్న బృందావనం ప్యాలెస్

పర్లాకిమిడి: ఒకప్పుడు భూతల స్వర్గంగా కొనియాడిన బృందవన ప్యాలెస్‌ను పట్టించుకునే నాథుడే లేడు. పర్లాకిమిడికి సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో అంధ్రా – ఒడిషా రాష్ట్రాల సరిహద్దు మహేంద్రతనయ ఒడ్డున ఉన్న ఈ ప్యాలెస్ రోజురోజూ శిథిలావస్థకు చేరుతోంది. ఒడిశా టూరిజం శాఖ ఆధీనంలో ఉన్న ఈ భవనం అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారింది. 1890 – 1905లో అప్పటి ఇంగ్లాడు ఇంజినీర్లు 17 ఎకరాల విస్తీర్ణంలో బృందావన్ ప్యాలస్‌ను నిర్మించారు. ఈ ప్యాలస్ నుండి గజపతి ప్యాలస్‌కు భూమార్గం ఉంది. అయితే తరాలు గడిచేనాటికి అది శిథిలమైనది. ప్యాలస్ ఆవరణలో ఉన్న అందమైన ఫౌంటైన్‌లు, ఇంగ్లాండ్ నుంచి తెప్పించిన టైల్స్ ఇతర ఫర్నీచర్ దొంగల పాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఫలక్‌నుమా ప్యాలస్ నమూనాలో నిర్మించిన బీఎస్ ప్యాలస్ ఒడిశాలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు విచ్చేసిన సైమన్ కమిషన్, మద్రాసు నుంచి వచ్చిన బ్రిటీష్ పాలకులకు ఇక్కడే వారికి సకల మర్యాదలతో విడిది ఏర్పాటు చేసేవారు. కానీ ప్రస్తుతం ఈ ప్యాలెస్ నిరాదరణకు గురవ్వడంతో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్యాలస్ ఆవరణలో పాడుబడిన గృహం

ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఈసీఐ ఆగ్రహం

భువనేశ్వర్:

ఎగ్జిట్ పోల్స్‌ను ప్రసారం చేసినందుకు ప్రైవేట్ ఒడియా న్యూస్ ఛానెల్‌పై చర్య తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారిని ఆదేశించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకుని నివేదికను సమర్పించాలని ఈసీఐ సీఈవోని ఆదేశించింది.

బీజేపీ నేతల నిరసన

బీజేడీ నేతలు వీకే పాండియన్, ప్రణబ్ ప్రకాష్ దాస్‌లు రాష్ట్రంలోని ఓ న్యూస్ ఛానల్ ఎగ్జిట్ పోల్స్ ప్రసారంలో పాల్గొన్నారని ఆరోపిస్తూ స్థానిక ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయం ఎదుట గురువారం బీజేపీ రాష్ట్ర శాఖ ధర్నాకు దిగింది. ఎగ్జిట్ పోల్ ప్రసార కార్యక్రమంలో పాలుపంచుకున్న ఇద్దరు అధికార పార్టీ నేతలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంకా చివరి దశ ఎన్నికలు జరగనప్పటికీ ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకే ఎగ్జిట్ పోల్స్‌ను ప్రసారం చేశారని బీజేపీ నేతలు మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికల అన్ని దశలు ముగిసే వరకు ఎగ్జిట్ పోల్ నిషేధించబడినందున, ఛానెల్‌కు జరిమానా విధించాలన్నారు. కాగా జూన్ 1న చివరి విడత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఓ ప్రైవేట్ ఛానెల్ మాత్రం ఎగ్జిట్ పోల్స్‌ను ప్రసారం చేసింది. ఎన్నికల సమయంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) విధించిన ఆంక్షలను ఇది పూర్తిగా ఉల్లంఘించడమే. ఎగ్జిట్ పోల్‌ను ప్రసారం చేసినందుకు బాధ్యులైన ఛానెల్ అధికారులు, వీకే పాండియన్, ప్రణబ్ ప్రకాష్ దాస్‌లను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని బీజేపీ నేత బాబు సింగ్ అన్నారు.



ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

క్లుప్తంగా

1 నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాత బస్టాండ్: వృద్ధులు, వితంతువులు, ఇతర సామాజిక భద్రతా పింఛన్లను గత నెలలాగానే ఈ నెల కూడా రెండు పద్ధతుల్లో లబ్ధిదారులకు అందజేయనున్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానంగా ఉన్న లబ్ధిదారులకు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో నేరుగా డీబీటీ విధానంలో పింఛను మొత్తాన్ని జమ చేస్తారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ నెలకు గాను జిల్లాలో 3,19,702 పింఛను దారులు ఉన్నారు. వీరికి రూ.93.30 కోట్లను విడుదల చేశారు. ఈ పింఛన్లలో 2,38,993 మంది లబ్ధిదారులకు రూ.71.69 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. మిగిలిన 80,709 మందికి రూ.21.60 కోట్లను జూన్ ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు జిల్లాలోని 732 గ్రామ వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇతర సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఇస్తారు. ఒకటి నుంచి ఐదో తేదీ లోగా అందరూ పింఛన్లు తీసుకోవాలని, గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ కోరారు.

నిబంధనల ప్రకారమే మెనూ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర రావు

పొందూరు: ప్రభుత్వ నిబంధనల మేరకే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు మెనూను అమలు చేయాలని డీఈఓ వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎండీఎం నిర్వాహకులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు అందించాల్సిన పౌష్టికాహారం తయారీపై ఎండీఎం నిర్వాహకులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు పీవీ రామరాజు, పి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు సెబ్ కళ్లెం



బట్టేరు వద్ద సీజ్ చేసిన లారీలు

శ్రీకాకుళం క్రైమ్ : నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు కళ్లెం వేశారు. సెబ్ జాయింట్ డైరెక్టర్ (అదనపు ఎస్పీ) డి.గంగాధరం ఆదేశాలతో అధికారులు పలు చోట్ల దాడులు నిర్వహించారు. సెబ్ జేడీ గంగాధరం చెప్పిన వివరాల మేరకు.. బుధ, గురువారాల్లో ఎచ్చెర్ల మండలం పొన్నాడ, శ్రీకాకుళం రూరల్ మండలం బట్టేరు-భైరి, కరజాడ, ముద్దాడపేటల్లో 213 టన్నుల ఇసుక లోడులతో ఉన్న 11 ట్రాక్టర్లను, ఎనిమిది లారీలను సీజ్ చేశారు. బట్టేరులో దొరికిన నాలుగు లారీల్లో వంద టన్నుల ఇసుకతో పాటు సీజ్ చేసిన లారీలను ఆయా మండలాల పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లకు అప్పగించారు.

రూ.10 లక్షలు దోపిడీ కేసులో మరొకరి అరెస్టు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామానికి సమీపంలో ఇటీవల ఒక కాంట్రాక్టర్ దగ్గర నుంచి పోలీసులమని చెప్పి రూ.10 లక్షలు దోపిడీ చేశారు. ఈ కేసులో మరొకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు. ఈ దోపిడీలో 12 మంది ఉన్నారని ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేసి రిమాండ్ పంపించామని, గురువారం ఆ దోపిడీలో ప్రధాన నిందితుడు అయిన శివ ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

16న జిల్లా స్విమ్మింగ్ సంఘ ఎన్నికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జూన్ 16వ తేదీన జరగనుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నగరంలోని సానావీధిలో ఉన్న హారికా కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు స్విమ్మింగ్ అసోసియేషన్ సమావేశంతో పాటు నూతన కార్యవర్గ ఎన్నికలను కూడా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశానికి స్విమ్మింగ్ అసోసియేషన్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, సీనియర్ స్విమ్మర్లు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని హారికాప్రసాద్ కోరారు.

రాత్రి గస్తీలు మరింత ముమ్మరం

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సమీపిస్తున్న వేళ ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు రాత్రివేళల్లో (నైట్) గస్తీలు మరింత ముమ్మరం చేశారు. చెక్ పోస్టుల్లోను, మద్యం దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ముఖ్య కూడళ్లలో వాహనాలు తనిఖీ చేస్తూ అక్రమ రవాణాకు అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. శ్రీకాకుళం నగర పరిధిలో ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం బుధవారం అర్ధరాత్రి దాటాక పలు లాడ్జీలు, ఆర్టీసీ కాంప్లెక్సు, బలగ, ఉమెన్స్ కాలేజీ, అరసవల్లి కూడళ్లలో గస్తీ విధులు నిర్వర్తించి అనుమానితులున్న చోట వారిని ఆపి వివరాలు సేకరించారు.

సిద్ధమవుతున్న జగన్నాథ రథ చక్రాలు

వార్షిక యాత్ర కోసం శ్రీజగన్నాథుని రథ చక్రాల తయారీ అంచెలంచెలుగా పూర్తవుతోంది. యాత్రలో మూడు రథాలకు సమగ్రంగా 42 చక్రాలు తయారు చేయాల్సి ఉంది. గురువారం నాటికి 25 చక్రాల నిర్మాణాలు రథ తయారీ శాలలో పూర్తయింది. ఇరుసు, ఇతర భాగాల నిర్మాణంతో పాటు రథాల ప్రభ ఇతరేతర అనుబంధ పనులు కొనసాగుతున్నాయి.

– భువనేశ్వర్







నాలుగో దశ ఎన్నికల్లో 460 మంది పోటీ

- 99.61 లక్షల మంది ఓటర్లు
- 25 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపు



నికుంజ బిహారి ధొలొ

భువనేశ్వర్: రాష్ట్రంలో శనివారం 4వ, చివరి విడత లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో 99.61 లక్షల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) నికుంజ్ బిహారీ ధొలొ గురువారం మీడియాకు తెలిపారు. వీరిలో పురుషులు 50.88 లక్షలు కాగా, మహిళా ఓటర్ల సంఖ్య 48.72 లక్షలు, థర్డ్ జెండర్ ఓటర్ల సంఖ్య 6,087గా పేర్కొన్నారు. ఈ విడతలో సమగ్రంగా 460 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. రాష్ట్రంలోని బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, మయూర్‌భంజ్, జగత్‌సింగ్‌పూర్ 6 పార్లమెంటరీ నియోజకవర్గాలు, వాటి పరిధిలోని 42 శాసనసభ నియోజకవర్గాలకు చివరి దశలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ స్థానాల్లో ఓటర్ల కోసం 10,882 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 14 పోలింగ్ కేంద్రాలు మహిళలే నిర్వహించనున్నారు. పోలింగు కార్యకలాపాల కోసం 70,000 మందికి పైగా పోలింగ్ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. మొత్తం 460 మంది అభ్యర్థుల్లో 394 మంది అభ్యర్థులు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుండగా, ఆరు లోక్‌సభ నియోజకవర్గాల్లో 66 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

25 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపు

జూన్ 1న రాష్ట్రంలో చివరి దశ ఎన్నికలు జయప్రదం చేసేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 125 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సీఏపీఎఫ్)ని మోహరించనున్నట్లు సీఈవో నికుంజ్ బిహారీ ధొలొ తెలిపారు. బాలాసోర్ జిల్లాలో అత్యధికంగా 22 సీఏపీఎఫ్ కంపెనీలు, జాజ్‌పూర్‌లో 20 సీఏపీఎఫ్ కంపెనీలు మోహరించబడతాయన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ (ప్రధాన జనరల్ కోర్సుల) పరీక్షలు గురువారంతో ముగిశాయి. కొన్ని కేంద్రాల్లో మాత్రమే ఒకేషనల్/బ్రిడ్జి కోర్సుల విద్యార్థులు పదుల సంఖ్యలో మరో రెండు రోజులపాటు పరీక్షలు రాస్తారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 24వ తేదీ నుంచి 51 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షల్లో భాగంగా.. రెండు సెషన్లుగా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆఖరి రోజు గురువారం కామర్స్, కెమిస్ట్రీ పేపర్లకు ఉదయం ఫస్టియర్ విద్యార్థులు 7129 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 6,765 మంది పరీక్ష రాశారు. 364 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెకెండియర్ విద్యార్థులు 2221 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 2109 మంది పరీక్షకు హాజరయ్యారు. 112 మంది డుమ్మా కొట్టారు. మొత్తం మీద ఆఖరిరోజు 476 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాలపై నిరంతరం ఫోకస్..

ఇంటర్మీడియెట్ విద్య జిల్లా డీవీఈఓ కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యామ్‌సుందర్, గూన సింహాచలం, కీర్తి తవిటినాయుడు, ఇతర అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. వీరితోపాటు మూడు ఫ్లయింగ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలను చేపట్టారు. ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా పరీక్ష కేంద్రాలపై ఫోకస్ చేశారు. మరో మూడు నాలుగు రోజుల్లో ఈ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం మొదలుపెట్టేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.



శ్రీకాకుళంలోని ఓ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కొనసాగుతున్న పాలీసెట్ కౌన్సెలింగ్



సహాయ కేంద్రంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

- షెడ్యూల్‌లో మార్పులు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన పాలీసెట్-2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆధారిత సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 27న కౌన్సెలింగ్ ప్రారంభం కాగా, గురువారం షెడ్యూల్ మేరకు 43001 నుంచి 59000 ర్యాంకు మధ్య విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఈ పరిశీలనకు 312 మంది హాజరయ్యారు. సహాయ కేంద్రంలో శుక్రవారం 59001–75000 ర్యాంకు మధ్య ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో జూన్ నాలుగున సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్, శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా మార్పులు చేశారు. ఆన్‌లైన్ ఫీజు చెల్లింపులో ఎలాంటి మార్పు ఉండదు. జూన్ రెండు లోపు చెల్లించాలి. రెండో తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో మార్పు ఉండదు. షెడ్యూల్ మేరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది. జూన్ మూడో తేదీన జరగాల్సిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ జూన్ 6వ తేదీన జరుగుతుంది. ప్రత్యేక రిజర్వేషన్లు వర్తించే వారికి సైతం ఇదే షెడ్యూల్ వర్తిస్తుంది. పాత షెడ్యూల్ మేరకు ఆప్షన్ల ఎంట్రీకి ఈ నెల 31 నుంచి జూన్ ఐదు వరకు అవకాశం ఇవ్వగా, ప్రస్తుతం జూన్ ఏడు నుంచి పదో తేదీ వరకు మార్పు చేశారు. ఆప్షన్ల మార్పు తేదీ జూన్ 5 నుంచి 11వ తేదీకి మార్చారు. అలాట్‌మెంట్‌ల ప్రకటన జూన్ ఏడు నుంచి 13వ తేదీకి మార్చారు. సీటు లభించిన విద్యార్థులు కళాశాలకు రిపోర్టు చేయాల్సిన తేదీ జూన్ 10 నుంచి 14 వరకు కాగా, జూన్ 14 నుంచి 19 మధ్యకు మార్చారు. క్లాస్ వర్క్ ప్రారంభం జూన్ 10 నుంచి కాగా, జూన్ 14వ తేదీకి మార్పు చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియను శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

కోరం లేక పలాస మున్సిపల్ సమావేశం వాయిదా



మున్సిపల్ కార్యాలయంలో ఎస్ఐ వెంకటరావు, పీసీలు, ఆర్మ్‌డ్ ఫోర్స్

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం జరగాల్సిన మే నెల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదాపడింది. ఉదయం 11 గంటలకు తెలుగుదేశం పార్టీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాత్రమే హాజరయ్యారు. 21 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు హాజరుకాకపోవడంతో కోరం సరిపోలేదు. కొద్దిసేపు వేచి చూసిన అనంతరం చైర్మన్ గిరిబాబు సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికార పార్టీకి దూరంగా ఉన్నారని, అందుకు నిరసనగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బాయ్‌కాట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మున్సిపల్‌సమావేశం సందర్భంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ మధ్య గొడవలు జరుగుతాయని పోలీసులు ఊహించారు. దీంతో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు కాశీబుగ్గ ఎస్ఐ వెంకటరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గస్తీ కాశారు. అయితే కోరం లేక సమావేశం వాయిదా పడింది. ఈ తరుణంలో మున్సిపల్ సమావేశానికి ముందు ఓ తెలుగుదేశం నాయకుడు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సమావేశ మందిరంలో ఉన్న మంత్రి నేమ్ ప్లేట్‌ను విరగ్గొట్టడం చర్చనీయాంశమైంది.

‘రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలి’



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

టెక్కలి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తనాలు విక్రయించే ప్రైవేటు డీలర్లు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ ఆదేశించారు. టెక్కలి సబ్ డివిజన్ పరిధిలో గల వ్యవసాయాధికారులు, ప్రైవేట్ విత్తనాల డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను నిర్దేశించిన ధరలకే అమ్మకాలు చేయాలని పేర్కొన్నారు. అలాగే విత్తనాల ధరల పట్టికలను కచ్చితంగా ఉంచాలన్నారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించి, నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే ఆయా డీలర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ హెచ్చరించారు. సమావేశంలో ఏడీ బీవీ తిరుమలరావు తో పాటు నాలుగు మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

1000 లీటర్ల సారా ఊట ధ్వంసం



మామిడిగుడ్డి గ్రామంలో సారా ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని మామిడి గుడ్డి గిరిజన గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు గురువారం సారా తయారీ స్థావరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారీ నేరమని, గిరిజన యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. టెక్కలి ఎస్ఈబి సిఐ రాజశేఖర్ నాయుడు, ఎస్ఈబీ సిబ్బంది పలువురు ఉన్నారు.

బండి.. కొత్త చట్టమండీ!

- జూన్ 1 నుంచి అమల్లోకి కొత్త వాహన చట్టం
- మైనర్లకు వాహనాలిస్తే జైలే
- మందుబాబులకు భారీగా జరిమానాలు

శ్రీకాకుళం క్రైమ్ :

మైనర్లు ప్రాణాలు తీస్తున్నారు. నిర్లక్ష్యంగా బైక్ డ్రైవింగ్ చేస్తూ నిండు ప్రాణాలు పోవడానికి కారణమవుతున్నారు. బైక్ నడిపేందుకు వయసు, అనుమతి లేకపోయినా రయ్‌మంటూ పోనిస్తూ పాదచారులు, వాహనదారులను వణికిస్తున్నారు. వీరికి తోడు మందు బాబులు కూడా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలో ఈ మధ్య జరిగిన ఎన్నో రోడ్డు ప్రమాదాలే ఇందుకు సాక్షి. ఇకపై వీరి ఆగడాలు సాగకుండా జూన్ 1 నుంచి కొత్త వాహన చట్టాన్ని అమలులోకి తీసుకురానున్నారు.

సవరించిన చట్టం (కొత్త చట్టం) ప్రకారం..

- ప్రస్తుతం ఉండే వాహన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిచ్చి ప్రమాదాలకు గురైతే రూ. వెయ్యి జరిమానా, నేరం నిరూపితమయ్యే వరకు జువైనల్ కోర్టుకు మైనరు బాలుడు ప్రతి శుక్రవారం హాజరయ్యే ప్రక్రియ ఉండేది. బాధితుల తరఫు వారు, బాలుడి తరఫు వారు మాట్లాడుకునేదాన్ని బట్టి ఉండేది.
- కానీ కొత్తగా సవరించిన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలు ఇస్తే ఆ బండి ఎవరి పేరున ఉంటే(తల్లిదండ్రులకు గానీ సంరక్షకులకు గానీ) రూ. 25 వేలు జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు.
- మద్యం సేవించి వాహనాలు నడిపేవారికి గతంలో రూ. 2 వేలు జరిమానా, ఆరు నెలలు జైలు శిక్ష ఉండేది. కొత్త చట్టం ప్రకారం రూ. 10 వేలు జరిమానాతోపాటు ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు.

నియమాలు పాటించాల్సిందే..

రోడ్డు నియమ నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లాలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిందేనని ఎస్పీ తెలిపారు. లేకుంటే భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రాణం చాలా విలువైందని, కొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగుల్చుతుందన్నారు. లైసెన్సు ఉంటేనే వాహనాలను నడపాలని, ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సంకేతాలను పాటించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపరాదని, కార్లలో సీట్‌బెల్టు తప్పనిసరని ఎస్పీ సూచించారు.



హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ చేస్తున్న జిల్లా పోలీసులు

డ్రంక్ అండ్ డ్రైవ్

2023లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 150 నమోదయ్యాయి. 2023 సెప్టెంబరు నుంచి చట్టాలపై భయం ఉండాలని ఈ కేసులకు ఎఫ్ఐఆర్ వేయడం మొదలుపెట్టారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు 243 కేసులకు ఎఫ్ఐఆర్ వేశారు. మైనర్లకు సంబంధించి.. ప్రమాదాల్లో 2022లో ఒకటి, 2023లో 07, 2024లో ఒకటి కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

2023లో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే..

రహదారులు	ఘోర ప్రమాదాలు	ప్రాణాంతకం కాని ప్రమాదాలు
నేషనల్ హైవే	139	167
స్టేట్ హైవే	58	133
ఇతర రోడ్లు	84	229

గడిచిన మూడేళ్లలో జిల్లాలోని రోడ్డు ప్రమాదాల పరిస్థితి

సంవత్సరం	జరిగిన ప్రమాదాలు	చనిపోయిన వారు	గాయాలైన వారు
2021	722	252	843
2022	811	270	1003
2023	810	297	902



ఇది కాదా ప్రమాదం.. (ఆటోల మధ్య కాలేసుకుంటూ వెళ్తున్న యువకులు)

రెండు బ్రాంచ్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు



జి.గోవిందనాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రెండు బ్రాంచ్‌లకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ జి.గోవిందనాయుడు తెలిపారు. కళాశాలలో గురువారం వివరాలు తెలియజేశారు. డిప్లమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ (డీసీఎంఈ)లో 60 సీట్లు ఉండగా ఈ కోర్సుకు, డిప్లమా ఇన్ ఫార్మసీ (డీ ఫార్మా) 40 సీట్లు ఉండగా ఈ కోర్సుకు ఎన్‌బీఏ అక్రిడేషన్ లభించినట్లు చెప్పారు. డిప్లమా ఇన్ అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ (డీఏఈఐఈ)లో 30 సీట్లు ఉన్నట్లు చెప్పారు. పాలిసెట్ కౌన్సెలింగ్‌లో విద్యార్థినులు మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఎంచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని, అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వసతి గృహం సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. 2027 ఏడాది వరకు ఎన్‌బీఏ గుర్తింపు లభిస్తుందని అన్నారు. తమ విద్యార్థులు రూ. 8 లక్షలు వార్షిక ప్యాకేజీకి సైతం ఎంపికయ్యారని అన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధుడు



వృద్ధుడు తమ్మినాయుడుతో ప్రదీప్ యువసేన సభ్యులు

పాతపట్నం: విజయనగరం జిల్లా, గుర్ల మండలం కొలాని గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వృద్ధుడు జమ్ము తమ్మినాయుడును పాతపట్నంకు చెందిన ప్రదీప్ యువసేన సభ్యులు ఆయన కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. తమ్మినాయుడు కొద్ది రోజులుగా పాతపట్నం మండల కేంద్రంలోనే తిరుగుతున్నారు. ప్రదీప్ యువసేన సభ్యులు జి.రాము, ఎస్.ప్రదీప్, సుందరావు, నాగేశ్, శంకర్‌లు వృద్ధుడి వివరాలు తెలుసుకుందామని ఆరా తీసి ఆయన ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. ఆ ఫొటో చూసిన వృద్ధుని కుటుంబ సభ్యులు ఫోన్‌లో ప్రదీప్ యువసేన సభ్యులను సంప్రదించారు. అన్ని వివరాలు తెలుసుకున్నాక గురువారం పాతపట్నం వచ్చి వృద్ధుడిని తమ ఇంటికి తీసుకెళ్లారు. ప్రదీప్ యువసేన సభ్యులను అందరు అభినందించారు.







ముచ్చట్ల వేదిక..

సాయంత్రమైతే చాలు.. ఆ గాలిలో ఊసులన్నీ ఊరేగుతాయి.. నేస్తం పలికిన మాటలు మనసుపై మందులా పని చేస్తాయి.. పొద్దంతా పోగు చేసిన కష్టాన్ని తగ్గిస్తూ సంధ్యా సమీరాలు కష్టజీవి తల నిమురుతాయి. జిల్లా కేంద్రంలోని నాగావళి పాత వారధిపై మలిపొద్దు వేళ స్నేహితులంతా ముచ్చట్లు పెడతారు. చల్లగాలిని ఆస్వాదిస్తూ కష్టసుఖాలు చెప్పుకుంటారు. చీకట్లు ముసురుకుంటున్న వేళ మనసుల్లోని బాధనంతా ఖాళీ చేసి ఇంటికి చేరుకుంటారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

● డీపీఎం షణ్ముఖరాజు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగు లాభాదాయకమని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించ వచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. మండలంలోని సంతోషపురం గ్రామంలో కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులతో ఖరీఫ్‌లో సాగు చేయాల్సిన పంటలపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ప్రధాన పంటల సాగుకు ముందు ప్రతి రైతు భూమిని సారవంతం చేసేందుకు 20 నుంచి 30 రకాలతో కూడిన నవధాన్యాలను విత్తి, 45 రోజుల తర్వాత భూమిలో కలియదున్నాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతుల సాగు విస్తీర్ణాన్ని ఒక బ్లాక్‌గా గుర్తించి, పంటలను మార్కెటింగ్ చేసేందుకు పీజీఎస్ సర్టిఫికెట్ చేస్తామన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటల సాగుకు రైతులను సమాయత్తం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, శ్రీనివాసరావు, దేవీ ప్రసాద్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంపై శిక్షణ

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనంపై పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ నెల 24 నుంచి జరుగుతున్న పరీక్షలు 31వ తేదీతో ముగుస్తాయి. జూన్ 1వ తేదీ నుంచి జవాబు పత్రాలను ఆన్‌లైన్ విధానంలో అధ్యాపకులు మూల్యాంకనం చేయనున్నారు. ఈ విధానంపై జిల్లాలోని ప్రభుత్వ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మోడల్ కాలేజ్, కేజీబీవీ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు చెందిన 275 మంది సిబ్బందికి జిల్లా వృత్తి విద్యాధికారి డి. మంజులవీణ అవగాహన కల్పించారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా మూల్యాంకనం పూర్తిచేయాలని ఆమె సూచించారు.

మైనర్లు వాహనం నడిపితే రూ.25 వేల జరిమానా

పార్వతీపురంటౌన్: మైనర్లు వాహనాలు నడిపితే రూ.25 వేలు జరిమానా విధించనున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రవాణా శాఖ జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు ప్రవేశపెడుతోందని, కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి రావడంతో, భారీగా జరిమానాలు విధించనున్నామన్నారు. అతివేగంతో వాహనం నడుపుతూ పట్టుబడితే రూ. 1000 నుంచి రూ. 2000 వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, అలాగే లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500 జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. మైనర్ వాహనం నడిపితే రూ.25వేలు అపరాధ రుసుం విధించడంతో పాటు మైనర్‌కు 25 ఏళ్ల వయసు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందకుండా ఆంక్షలు విధించనున్నట్లు స్పష్టం చేశారు.

108 పైలెట్ రక్తదానం

విజయనగరం ఫోర్ట్: శస్త్రచికిత్స అవసరమైన మహిళకు 108 ఉద్యోగి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. పద్మనాభం మండలంలోని గెద్దపేటకు చెందిన కె.సూర్యకాంతానికి రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేయాలని, అందుకోసం బి పాజిటివ్ గ్రూపు రక్తం ఒక ప్యాకెట్ ఎక్కించాలని చెప్పారు. దీంతో బంధువులు 108లో పైలెట్‌గా పనిచేస్తున్న బి.నారాయణరావును ఆశ్రయించడంతో పట్టణంలోని ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్‌కు గురువారం ఆయన వచ్చి రక్తదానం చేశాడు.

కొండపేటలో హైనా..!



కొండపేటలో సంచరించిన హైనా

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని కొండపేటలో హైనా(దుమ్మలగొండు) గురువారం సంచరించింది. సమీపంలో ఉన్న కొండపై నుంచి దిగిన హైనా కొండపేట గ్రామంలో చొరబడింది. దీంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు హైనాను బంధించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. అప్పలరాజు, డీఆర్‌ఓ కేవీఎస్ రాజు, ఎఫ్‌బీఓ రామారావు గ్రామానికి చేరుకుని బంధించిన హైనాను సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు.

వెంకన్నను దర్శించుకున్న ఎంపీ బెల్లాన దంపతులు

నెల్లిమర్ల రూరల్: కలియుగ వైకుంఠ దైవం తిరుమల వేంకటేశ్వరస్వామిని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులు గురువారం దర్శించుకున్నారు. నెల్లిమర్ల ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడుతో కలిసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు వైఎస్సార్‌సీపీ సొంతం కావాలని, రాష్ట్రానికి మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని.. ఎప్పటిలాగే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలవాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు.

నిప్పులవాన



● జిల్లాలో అగ్నిగుండంలా మారిన వాతావరణం
● ఉదయం 10 గంటల నుంచే ఉష్ణతాపం
● 43.09 డిగ్రీలకు తాకిన ఉష్ణోగ్రత
● నిర్మానుష్యంగా మారిన రహదారులు
● జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

జన సంచారంలేని పార్వతీపురం ఫ్లెఓవర్ బ్రిడ్జి

పార్వతీపురం టౌన్:

రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఎండలు కాస్తాయన్నది పెద్దల మాట. ప్రస్తుతం ఎండలను చూస్తే ఆ మాట అక్షరసత్యమనిపిస్తోంది. మన్యంలో రెండు రోజులుగా నిప్పులవాన కురుస్తోంది. వాతావరణం ఒక్కసారి భగ్గుమంది. సూర్యుడు ఉగ్రరూపం దాల్చడంతో జిల్లా అగ్నిగుండంగా మారింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో జిల్లా వాసులు ఆపసోపాలు పడుతున్నారు. వేసవి ప్రారంభమైనప్పటి నుంచి ఉష్ణోగ్రతల్లో ఘననీయంగా పెరుగుదల నమోదవుతోంది. ఉష్ణతీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు హడలెత్తుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుమ్మం నుంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో వీస్తున్న వడగాడ్పులు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. జిల్లాలో పలుచోట్ల గురువారం 42 నుంచి 43.09 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా పార్వతీపురం పట్టణంలో 43.09 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. 15 మండలాల్లోనూ 42 డిగ్రీలు, అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు కొబ్బరి బొండాలు తాగుతున్న పట్టణ వాసులు

ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి

ఎండవేడికి జనం విలవిల్లాడారు. ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. వడగాడ్పులతో బస్సులు, బైక్‌లు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు ఇబ్బందులు పడ్డారు. కొబ్బరి బొండాలు, మజ్జిగతాగుతూ ఉపశమనం పొందారు. మహిళలు ఎండ వేడిమి తాళలేక గొడుగులు, స్కార్ఫ్‌లతో ప్రయాణం సాగించారు.



పట్టణంలో బైపాస్ రహదారిలో ఎండవేడిమికి తాళలేక చీరకొంగు, చున్నీ నీడలో సాగిపోతున్న మహిళలు

జాగ్రత్తలు తప్పనిసరి..

వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రతకు శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడుపై ప్రభావం చూపుతుందని, ఫలితంగా మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం దెబ్బతిని ప్రాణాపాయానికి దారి తీస్తుందన్నది వైద్యుల మాట. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. అత్యవసర సమయంలో బయటకు పనికి వెళ్లే వారు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎండ తీవ్రత ఎక్కువ ఉండే సూచనలు ఉన్నందున ఆ సమయంలో సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా ఉండటం మంచిదంటున్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లేవారందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో గత రెండు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా..

మండలం	బుధవారం	గురువారం
పార్వతీపురం	43.2	43.9
సీతానగరం	44.7	43.08
బలిజిపేట	43.7	42
సాలూరు	45.2	43.01
మక్కువ	43.5	42.07
పాచిపెంట	43.5	42.06
కురుపాం	42.0	42.2
గుమ్మలక్ష్మీపురం	42.0	43.01
జియ్యమ్మవలస	43.7	42.1
గరుగుబిల్లి	44.7	43.01
కొమరాడ	44.0	42.07
పాలకొండ	43.7	42.04
సీతంపేట	44.1	43.01
వీరఘట్టం	43.7	42.7
భామిని	43.7	42.01

ఎండలో తిరగొద్దు



ఎండ తీవ్రత పెరిగింది. వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో తిరగకూడదు. రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్, గ్లూకోజ్, నిమ్మరసం వంటి ద్రావణాలు ఎక్కువగా తీసుకోవడం మంచిది. అత్యవసర వేళ బయటకు వెళ్లేవారు తాగునీరు, గొడుగును వెంట తీసుకెళ్లాలి. తెలుపు రంగు లేదా పలుచటి చేనేత వస్త్రాలు, తలకు టోపీ లేదా రుమాల్ ధరించాలి. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు తిరగరాదు. శరీరాన్ని డీ హైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ అతిగా తీసుకోవద్దు.

– డాక్టర్ విజయ పార్వతి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం మన్యం



కొనుగోలుదారులు లేక బోసిపోయిన పండ్ల దుకాణాలు

ఉపాధ్యాయుడికి ఆరునెలల జైలుశిక్ష

● చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయిగా నిర్ధారణ
● నెలలో అసలు, వడ్డీ ఇవ్వకుంటే జైలుశిక్ష పొడిగింపు

శృంగవరపుకోట: తన ఖాతాలో నగదు లేకుండా చెక్ ఇచ్చి మోసం చేసిన కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.వాణి గురువారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన అల్లు శ్రీనివాసరావు దగ్గర జామి మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జాగరపు వెంకట అప్పారావు రూ.2లక్షలు అప్పు తీసుకున్నారు. తర్వాత అప్పు తీర్చే క్రమంలో శ్రీనివాసరావుకు రూ.1.50లక్షల చెక్కు ఇచ్చాడు. శ్రీనివాసరావు ఆ చెక్కును బ్యాంక్‌లో జమ చేయగా, వెంకట అప్పారావు ఖాతాలో నగదు లేదంటూ బ్యాంకర్లు తిరస్కరించారు. దీంతో బాధితుడు శ్రీనివాసరావు న్యాయవాది బి.త్రిమూర్తులు ద్వారా కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో వాదోపవాదాలు విన్న అనంతరం చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేసినట్లు వెంకటఅప్పారావును ముద్దాయిగా నిర్ధారించి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎస్.వాణి తీర్పు ఇచ్చారు. నెలరోజుల్లో శ్రీనివాసరావుకు ఇవ్వాల్సిన అసలు, 9శాతం వడ్డీ కలిపి చెల్లించాలని, లేకుంటే మరో ఆరునెలలు అధికంగా జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందని తీర్పులో పేర్కొన్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

వీధికుక్కల దాడిలో ఆవు దూడల మృతి

మెరకముడిదాం: మండల కేంద్రం మెరకముడిదాంలో గురువారం వీధికుక్కల దాడిలో రెండు ఆవుదూడలు మృతిచెందాయి. మెరకముడిదాం గ్రామానికి చెందిన బంటుపల్లివెంకటేశ్వరరావు, గొర్లెనారాయణరావులకు చెందిన రెండు ఆవుదూడలను వీధికుక్కలు వెంటాడి చీరేశాయి. వీధి కుక్కలు చికెన్ సెంటర్ల వద్ద వారు పారేసిన వ్యర్థాలకు అలవాటు పడి అప్పుడప్పుడు ఇలా ఆవులు, దూడలపై దాడులు చేసి చీరేస్తున్నాయని బాధిత యజమానులు చెబుతున్నారు.

వేలల్లో తమకు లాభాన్ని చేకూర్చుతాయనుకున్న ఆవుదూడలు వీధి కుక్కలు పాలవడంతో నష్టపోయామని లబోదిబోమంటున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కలను నిర్మూలించే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆక్రమణలు చేస్తే సహించేది లేదు

విజయనగరం టౌన్: దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన విజయనగరం లోని కోట వద్దనున్న శ్రీ విద్యార్థి అలియాస్ నీలాయమ్మ సత్రానికి సంబంధించిన స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని, చట్ట పరంగా చర్యలు చేపడతామని దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆమె మాట్లాడుతూ ఇటీవల కొందరు వ్యక్తులు టౌన్ సర్వే నంబర్ 509లో ఉన్న ఖాళీస్థలాన్ని ఆక్రమించుకునేందుకు సిమెంట్ పోల్స్‌ను, సిమెంట్ పలకలతో ప్రహరీని అనధికారికంగా నిర్మించేందుకు చేసిన ప్రయత్నాన్ని అడ్డుకున్నామన్నారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపికలను కలిసి సమస్య విన్నవించినట్లు తెలిపారు. సత్రం స్థలంలో ఉన్న పోల్స్‌ను తొలగించి, అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశామని చెప్పారు. దేవాదాయశాఖకు చెందిన స్థలాలు ఆక్రమించే వ్యక్తులపై చట్టం ప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓ వంశీలక్ష్మి, జిల్లా పోలీస్ అధికారులు, దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నీలాయమ్మ సత్రం వద్ద దేవాదాయశాఖ అధికారులు పాతిన హెచ్చరిక బోర్డు

అస్వస్థతతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: అస్వస్థతకు గురైన గుర్తుతెలియని వ్యక్తి ఎస్.బూర్జవలస గ్రామంలో మృతి మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న చవక చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి కొన ఊపిరితో ఉండడాన్ని అటుగా వెళ్తున్న ఉపాధి హామీ వేతనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు 108 వాహనంలో గజపతినగరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో ఉంచామని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని ఎస్సై లక్ష్మీప్రసన్న కుమార్ కోరారు.

ఫిష్ ఆంధ్రా షాపుల్లో గిరాకీ

● జిల్లాలో 72 అవుట్‌లెట్‌లు
● గణనీయంగా పెరిగిన లైవ్‌ఫిష్, తాజా ఫిష్ అమ్మకాలు

పూసపాటిరేగ: మత్స్యకారులకు అండగా ఉంటూ మత్స్యసంపదను విలువ ఆధారిత ఉత్పత్తిగా మార్చడానికి రాష్ట్రప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంది. దీంతో వేలాది మంది మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పడింది. ఆహారంలో కీలకపోషకాలు ఉన్న చేపల ఉత్పత్తి అమ్మకాలకు మంచి రోజులు వచ్చాయి. ఫిష్ ఆంధ్రా నినాదంతో విజయనగరం జిల్లాలో 72 మినీ అవుట్‌లెట్లు ఏర్పాటు చేశారు. జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సముద్రతీరం 27 కిలోమీటర్లు ఉంది. తీరం వెంబడి 19 మత్స్యకార గ్రామాల్లో సుమారు 20 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. ప్రత్యక్షంగా 6 వేలు, పరోక్షంగా 14 వేల మంది మత్స్యకారులు మత్స్యసంపదపైనే ఆధారపడి ఉన్నారు. వేట చేస్తున్న 3798 మంది మత్స్యకారులకు గుర్తింపు కార్డులను ఇప్పటికే ప్రభుత్వం జారీ చేయడంతో వేట నిషేధ సమయానికి మత్స్యకార భరోసా మంజూరుకు ప్రతిపాదనలు చేశారు. సముద్రం నుంచి వచ్చిన మత్స్యసంపద ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్ యూనిట్ల ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాలో 72 మినీఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్‌ల ద్వారా నిత్యం చేపలు విక్రయిస్తున్నారు. రిజర్వాయర్, చెరువులో లభ్యమయ్యే చేపల్లో అధికంగా లైవ్‌ఫిష్‌లు ఉండడంతో వాటికి గిరాకీ బాగా పెరగడంతో అమ్మకాల్లో వృద్ధి బాగా పెరిగింది.

మత్స్యకారులకు మేలు

ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్‌ల ద్వారా అమ్మకాలను గణనీయంగా పెంచారు. ఫిష్ ఆంధ్రా యూనిట్లు ఏర్పాటు చేయడంతో చేపల వేట చేసే మత్స్యకారులకు మేలు జరుగుతోంది. రాష్ట్రం, దేశం, విదేశాలకు ఎగుమతి అయ్యే మత్స్యసంపద మార్కెటింగ్‌కు సంబంధించి మరిన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మత్స్యకారులు వేట చేయగా వచ్చిన మత్స్యసంపదకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఇబ్బందులు పడేవారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులు వేట చేసిన మత్స్యసంపద అమ్మకాలకు మంచి మార్కెట్ కల్పించడానికి ఫిష్ ఆంధ్రాషాపులు ఏర్పాటు చేయడంతో వారి జీవితాలు మెరుగుపడ్డాయి. మత్స్యకారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

కొత్త వరి వంగడాలతో..

రైతన్నకు సిరి



ఎంటీయూ-1224 రకం వరి పంట

జిల్లాలోని రైతన్నలకు సిరులు కురిపించే వరి వంగడాల సాగును వ్యవసాయ యంత్రాంగం ప్రోత్సహిస్తోంది. చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే సరికొత్త వరి వంగడాలను రైతులకు అందుబాటులోకి తెచ్చింది. సాగు పద్ధతులను వివరిస్తోంది. ఏ నేలకు ఏ రకం మంచిదో తెలియజేస్తోంది. సాంబ, స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ-1224, 1318 రకాలను సాగుచేయాలని సూచిస్తోంది.

● సాంబ, స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, 1318 రకాల సాగుకు ప్రోత్సాహం
● 1224 రకం తినడానికి అనువైనది
● చీడపీడలు తట్టుకుంటుందంటున్న వ్యవసాయ అధికారులు
● ఇప్పటికే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సాగు
● ఆశాజనకంగా దిగుబడులు
● ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగుకు వీలుగా 4,076 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్ సీజన్‌కు సమయం ఆసన్నమైంది. నైరు రుతుపవనాల ఆగమనంతో మరికొద్ది రోజుల్లో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో జిల్లాలోని రైతన్నలు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నారుమడులు, వెద పొలాలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఆర్‌బీకేల్లో విత్తనాలను నిల్వ చేసింది. ఈ ఏడాది కొత్త వరి వంగడాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సాగుచేయించి, అధిక దిగుబడులు రావడంతో జిల్లాలోని రైతులందరూ ఆ రకాలను సాగుచేసేలా ప్రోత్సహిస్తోంది. దీనికోసం ఊరూరా రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి కొత్త వరి వంగడాలను పరిచయం చేస్తోంది. సాగువల్ల కలిగే లాభాలను, పంట కాలాన్ని వివరిస్తోంది.

● **వరి సాగే జీవనాధారం**

జిల్లాలో సాగయ్యే పంటల్లో వరి సాగుదే అగ్రస్థానం. అత్యధికంగా 90,058 వేల హెక్టార్లలో ఏటా సాగవుతోంది. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ విత్తన కేటాయింపులు చేస్తోంది. ఇప్పటికే ఎంటీయూ 1121 రకం విత్తనాలను రైతుభరోసా కేంద్రాలకు సరఫరా చేసింది. సాంబమసూరికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ--1224 రకం, స్వర్ణకు బదులుగా ఎంటీయూ-1318 రకం వంగడాలు సాగుచేయాలని రైతులకు సూచిస్తోంది. ఈ రెండు రకాలకు సంబంధించి 4,076 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంచేసింది.

● **స్వర్ణకు సరిపోలేలా ఎంటీయూ 1318 రకం**



స్వర్ణకు బదులు ఎంటీయూ 1318 రకాన్ని వేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. స్వర్ణ రకం 1982వ సంవత్సరం నుంచి సాగులో ఉంది. ఈ నేపథ్యంలో 1318 రకాన్ని వేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ రకం పంట కాలం 150 రోజులు. ఎకరానికి 30 బస్తాల దిగుబడి వస్తుంది.

తిండికి పనికొచ్చే ఎంటీయూ-1224 రకం



సాంబమసూరి రకం వరికి తెగుళ్ల బెడద ఎక్కువ. ఇది 1986వ సంవత్సరం నుంచి సాగులో ఉంది. సుమారు నాలుగు దశాబ్దాలుగా సాగులో ఉండడంతో తెగుళ్ల తాకిడి ఎక్కువైంది. ఏటా రైతులు పంట నష్టపోతున్నారు. పంట చేతికి వచ్చే వరకు బెంగపడాల్సిన పరిస్థితి. దీనికి ప్రత్యామ్నాయంగా తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధిక దిగుబడులు వస్తున్న ఎంటీయూ-1224 రకం సాగును వ్యవసాయ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. గత రెండేళ్లుగా జిల్లాలోని కొన్ని మండలాల్లో కొందరు రైతులు సాగు చేశారు. ఎకరాకు 25 బస్తాల దిగుబడి సాధించారు. ఇది సన్నని రకం. తినడానికి అనువుగా ఉంటుంది. ఈ పంట కాలం 135 రోజులు. చీడపీడలను తట్టుకుంటుంది. గాలులకు చేను పడిపోదు. దోమపోటు రాదు. ధర కూడా సాంబ రకంతో సమానం. జిల్లాలోని నేలలు ఈ రకం సాగుకు అనువైనవని అధికారులు చెబుతున్నారు.

చౌడు నేలలకు ఎంసీఎం 103 రకం అనుకూలం



ఈ రకం సన్నని రకం. చౌడు నేలల్లో కూడా బాగా పండుతుంది. దీని పంట కాలం 140 రోజులు. నేరుగా గాని, దమ్ము చేసి నాట్లు కూడా వేసుకోవచ్చు. ఎకరానికి 30 బస్తాలు దిగుబడి వస్తుంది.

పంట కలిసొచ్చేలా..

రైతులకు వరి పంట కలిసొచ్చేలా ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎంటీయూ-1224, ఎంటీయూ 1318 రకాల సాగును ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటికే మండల వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విత్తనాలను కూడా కేటాయించాం. సాంబమసూరి, స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా వీటిని రైతులు సాగుచేసుకోవాలి. అధిక దిగుబడులతో పాటు గిట్టుబాటు ధర లభిస్తుంది.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి